# దారిలో దొరికిన భార్య

మద్రాసుపోయే మెయిల్ నెల్లూరు వచ్చేటప్పటికి రాత్రి రెండుదాటింది.

బండికోసం మూడుగంటల్నించి యెదురుచూస్తున్న ముసలి ప్లీడరు చేతిసంచీని గట్టిగా పట్టుకొని మూడో తరగతి పెట్టెకోసం పరుగెత్తసాగాడు.

చివరికి కొద్దికష్టంతో ఆ పెట్టెను వెతుక్కోగలిగాడు. తర్వాత ఆయనికి కలిగిన రెండోగండం యేమిటంటే పెట్టెలోకి చొరబడ్డం, గేటుదగ్గర నించున్న కాకీలాగు నిరక్షరాస్యుడు జనాన్ని లోపలికిరాకుండా, అడ్డునించుని, ‘మిల్ట్రీ’ ‘మిల్ట్రీ’ అంటున్నాడు. కాని యెవరో చదువుకొన్న పెద్దమనిషి ధర్మమా అని అందరూ పెట్టెలోకి చొరబడగలిగారు. వాళ్ళతోపాటే ముసలిప్లీడరూను! తర్వాత రైలుకదిలింది. కిటికీల్లోంచి చల్లగాలివేస్తోంది. దూరంనుంచివస్తూ సగంనిద్దర్లో కళ్ళు తెరిచిన వాళ్ళు మళ్ళీ కళ్లుమూసుకున్నారు. ఇందాకటినించి మెయిల్ కోసం యెదురుచూచిన, అక్కడ యెక్కినవాళ్ళు నిద్రప్రయత్నంలోవున్నారు. కూచున్నవాళ్లు కూచునే, మూలనక్కిన వాళ్లు మూలనే, నించున్నవాళ్లు బెర్తునుపట్టుకుని వేళ్ళాడుతూను.

ఒక అరగంటగడచేటప్పటికి మన ప్లీడరు, అందర్నీ దాటుకుని, కొందరిచేత తిట్లుతిని, ఒక మూలకి రాగలిగాడు.

అక్కడ ఆయన్ని ఆకర్షించిన దృశ్యమేమంటే మూల కూచుని నిద్రలో అర్ధనిమీలితాలైన నేత్రాలతో చూస్తున్న

పాతికేళ్ళయువతి, సన్నంగా అందంగావుంది. తెల్లని చీర కట్టు కుంది. ముక్కున బేసరి, చెవుల్ని లోలకులు మెళ్లో మూడు పేటల చంద్రాలహారం ఆభరణాలు, మనిషిచూస్తే వుత్తమకులానికి చెందిన దానిలావుంది. నుదుట బొట్టుమాత్రం లేదు.

నెమ్మదిగా ముసలి ప్లీడరు ఆవిడికి కొంచెం యివతిలగా యిరికాడు. ఆవిడ కేసి పరకాయించి, మళ్ళీ తను చూస్తుండడం ఎవరూ గమనించకుండా వుండేలా సూచుకుంటూ, చూస్తున్నాడు.

మెయిల్ మహావేగంలో పరుగెడుతోంది. అంత వేగంలోనూ గాలి కిటికీల నించి వేస్తోంది. దోమలు దీపంచుట్టూ ముసురుతోనే వున్నాయి. బెర్తుమీద పడుకొన్నవాళ్ళు గుర్రుపకుతోనే వున్నారు. క్రింద కూచున్నవాళ్ళ చోటుచాలక ఉమలోతాము యితరుల్ని తిట్టుకుంటూ, అప్పుడప్పుడు సనుక్కుంటున్నారు.

అసలు పెట్టెలోకి యెక్కగానే నిద్దరోదా మనుకున్నాడు ప్లీడరు. కాని ఆవిడని చూస్తుంటే నిద్దర రావడంలేదు. ఏవో భావాలు పరుగెడుతున్నాయి మనసులో.

ఇంకో పావుగంట గడిచాక ప్లీడరు మెల్లగా యెవ్వారికీ వినిపించకుండా అన్నాడు.

"ఏవూరమ్మాయ్, మీది?"

ఇటూ, అటూ వాళ్ళవాళ్ళెవ్వరూ లేరుకదా అన్నట్టు ఓసారి పరకాయించి చూశాడు.

అంతసేపు ఆయన చర్యల్ని గమనిస్తున్న ఆవిడగొంతుకు సర్దుకుని అంది నిర్లక్ష్యంగానే.

"బెజవాడనుండి మాది."

"ఎవరూ, మీరు ?"

"నియోగులమండి"

"అయితే మావాళ్లేనన్నమాట !" సంబంధం కలుపుతున్నందుకు సంతోషిస్తూ చుట్టూచూచాడు విజయగర్వంతో.

"మీరూ నియోగులేనా ?" అని అడిగింది !

"అందుకు సందేహమా" అన్నాడు ఆయన,

మళ్లీ రెండుక్షణాలు రైలు చప్పుడులో దొర్లిపోయాయి.

"మీవాళ్లెవళ్లన్నా వున్నారా ? ఎక్కడికి కెడుతున్నావ్ ?"

ఆవిడ కొంతసేపు మౌనంగా, ఆలోచిస్తూ చూచింది. తర్వాత అంది !

"ఏమని చెప్పమంటారు? చెప్పుకుంటే చేట భారతమంతవుతుంది. ఎక్కడికిపోతున్నానో నాకే తెలియదు."

కంఠంలో దీనత్వం కన్పించింది, ప్లీడరుకు. సమాధానం కూడ అల్లానేవుంది. ఆయన ఆతృతఎక్కువయింది.

"ఇంత చిన్నతనంలో ఏమంత కష్టమొచ్చిందమ్మాయి? ఇంకా ముక్కుపసిలన్నా ఆరలేదే! అదేదో చెబుదూ, ఏమన్నా సహాయం చెయ్యగలిగితే చేస్తాను."

సానుభూతి పూర్వకంగా అన్నాడు. తర్వాత ఆవిడ కొంతసేపు ఆలోచించి, తన కథ చెప్పింది. అసలు ఒక బీద కుటుంబానికి చెందింది. తండ్రి పదిహేడేళ్ళొచ్చేవరకూ ఎంత

వెతికినా సంబంధం తేలేకపోయాడు. చివరికి బెజవాడలో ఎవరో ముసలివాడు, మూడో పెళ్ళివాడుంటే వాడికిచ్చి పెళ్ళి చేసాడు. ఆవిడ కాపరానికి వెళ్ళిన నాలుగేళ్ళవరకూ జీవితం బాగానేవుంది. తర్వాత భర్త జబ్బుపడి ఆర్నెల్లల్లో ఈలోకాన్ని వొదిలాడు. అప్పట్నించీ దిక్కులేందయింది. తల్లి తండ్రులు ఏమయ్యారో తెలీదు. ఇదిజరిగి రొండేళ్ళయింది. తర్వాత అల్లాపిచ్చిగా తిరుగుతోంది.

కథంతా విన్నాక ప్లీడరు సానుభూతిచూపకుండా వుండలేకపోయాడు. ఈ రొండో పెళ్ళిళ్ళు మూడో పెళ్ళిళ్ళు చేసుకునే వాళ్ళని తిట్టిపోసాడు. తను సంస్కారైనమూలాన్నే భార్య పోయి అయిదేళ్ళయినా ఎట్లా అవివాహితుడిగావుండి, తన ఆదర్శాన్నెల్లా కొనసాగిస్తున్నదీ, ఒక వుపన్యాసం దంచి తెలియ చెప్పాడు.

"పాపం, మీకు భార్య లేదూ?" ఆవిడడిగింది, సానుభూతి పూర్వకమైన కంఠస్వరంలో.

"అవును, పిచ్చిది, పోయింది" చిన్ననైన ముఖంతో ప్లీడరన్నాడు.

మళ్ళీ ఓపావుగంట మౌనాన్ని ధరించారు, ఇద్దరూ,

అప్పటికి అయిదయింది. రైల్లో కొందరు మేల్కొన్నారు. నవీనులమనుకున్నవాళ్ళు పాచి ముఖాలతోనే టీ తాగుతున్నారు. మిగిలినవాళ్ళు ఇంకా ముసుగుల్ని ఎగతన్నుతున్నారు.

వీళ్ళు స్టేషనులు వొచ్చినచోట కబుర్లుమాని, తర్వాత ప్రారంభిస్తూ కాలక్షేపం చేస్తున్నారు. ప్లీడరుకు ఆవలింతలు

వొస్తున్నాయి. నిద్రలేక కళ్ళు ఎర్రబడ్డాయి. ఆవిడకూడా అట్లాగే బడలిక చెందినట్లుగావుంది. ఇప్పుడిద్దరూ చనువుగా మాట్లాడుకో గలుగుతున్నారు.

"మీ కేమీ అనుకోనంటే, మీకో సంగతి చెప్పాలనుంది" అంది ఆవిడ, సణుగుతూ. ఆమాట అంటున్నప్పుడు కొంచెం తడబడింది కూడా.

"ఏమిటి, అది. భయమెందుకు? చెప్పు" అన్నాడు ప్లీడరు.

"మిమ్మల్ని చూస్తూంటే నాకు అదేదోలావుంది, ఏదో పాతజీవితం జ్ఞాపకమొస్తోంది......ఆయన తలుపుకొస్తున్నారు ఆయన్ని చూచినట్టుంది" అంది.

ఈ మాటలు వింటుంటే ప్లీడరుకు ఏదో శరీరంలో విద్యుచ్ఛక్తి ప్రవహించినట్టయింది. ఆశ్చర్యం ఒకమూలా, ఆనందం ఒకమూలా మనస్సుని ఆక్రమించాయి. ఆమాటల్లో ఎన్నో అర్థాలు ఆయనికి ధ్వనించాయి.

ఆవిడకూడా ఆయనకేసి ఆశతో చూసింది.

తర్వాత ఆయన ఒక అరగంటవరకూ మాట్లాడలేదు. అప్పుడే బాగా తెల్లారుతోంది.

"క్షమించండి, నా మాటలు మీకు కష్టంకలిగిస్తేను" అంది ఆవిడ మళ్లా.

"అదికాదు, నాకూ ఏదో జ్ఞాపకానికి తెచ్చాయి నీ మాటలు, మళ్ళీ సంసారజీవితంమీద ఆశకలుగుతోంది, అది అసంభవమైన విషయం అని తెల్సికూడా," అన్నాడు ప్లీడరు.

"అబ్బ! ఎంత సంతోషంగావుంది?" అంది.

"ఏం?"

"మీరు నాకు కొంత ఆదరువు కల్పించారంటే వెయ్యి జన్మాలకైనా మీసహాయం మర్చిపోను. నాకు కావల్సిందేమీ లేదు, మీయింట్లో కొంచెం తలదాచుకుందుకు చోటివ్వండి" అంది ఆవిడ మళ్ళీ మొట్ట మొదట మాట్లాడిన దీనత్వమే ధ్వనించింది ప్లీడరుకు.

"అందుకు అభ్యంతరమా?" అన్నాడు ప్లీడరు. ఆయనకు కూడా జీవితంలో మళ్ళీ పెద్ద వెలుగు కన్పించినట్టయింది. ఆరిపోయిన జ్యోతి వెలిగినట్టయింది.

తర్వాత వాళ్ళాట్టే మాట్లాడుకోలేదు.

ప్లీడరు తనతోపాటు ఆమెకీ సూళ్లూరుపేటలో కాఫీ, టిఫిన్ ఇప్పించాడు.

తర్వాత పట్నం చేరుకున్నారు. ఆమెని తన యింటికి తీసుకువెళ్ళాడు.

"మళ్లీ నా యింటికి కాంతిని తెచ్చావు. నా గృహలక్ష్మివి" అన్నాడు. ఆవిడ అభ్యంతరం చెప్పలేదు, మరి ఆశ్రయానికి వచ్చింది.

ప్లీడరు ఒక నెల్లాళ్ళల్లో సంసారజీవితంలో పడ్డాడు. ఇద్దరూ భార్యాభర్తల్లా వుంటున్నారు. ప్లీడరుకి వేరు విధమైన కోరికూడా కలక్కపోలేదు. ఆవిడమాత్రం తావనియ్యలేదు. చాకచక్యంతో తప్పించుకుంది. అట్లా అయితే వెళ్ళిపోతానని బెదరించింది. ప్లీడరందుచేత ఆ ఆలోచనని కొన్నాళ్లు అణచుకోదలచాడు.

ఆవిడ ఎంతో నమ్మకంతో వుంటోంది. ఇంట్లో చెల్లా చెదరిన వాటినన్నిటినీ జాగ్రత్తగా సర్దేది, లోపైనవన్నీ తెప్పించేది. ఆఫీసు రూం కూడా ఎంతో అందంగా సవరించేది ఆయన ఇంటికివచ్చే వేళకి.

ఆయనికి ఆవిడమీద ఏవిధమైన అపనమ్మకం కలగాల్సిన అవసరం కన్పించలేదు. తన భార్యనగలన్నీ పెట్టుకోమని ఇచ్చాడు. ఇనపపెట్టికూడా ఆమె కంట్రోల్ లోకేవచ్చింది. నౌకర్లకు ఆమె అంటే ఎంతో గౌరవం, భక్తి.

ఒకరోజున ప్లీడరు ఇంటికి వచ్చేటప్పటికి అరుగుమీద కూచున్న నౌకరు తాళాలు ఇచ్చాడు.

"అమ్మేదీ ?" అని అడిగాడు ప్లీడరు.

"ఏమో? ఇవి మీ కిమ్మన్నారు, ఇప్పుడే వస్తానని టాక్సీ మీద వెళ్లారు" అని నౌకరన్నాడు.

ప్లీడరుగుండెలు కొట్టుకున్నాయి. ఇంట్లో ఇనప్పెట్టె తెరిచి వుంది. డబ్బుమాత్రంవుంది. నగలులేవు.

"మళ్లా వొస్తుంది, నన్ను మోసగిస్తుందీ?" అనుకున్నాడు. ఒకరోజు, రెండు రోజులు, ఒక నెల గడిచాయి. ఆవిడరాలేదు. ప్లీడరు నిరాశ వైరాగ్యంలోకి దిగింది. పిచ్చిగా తయారయ్యాడు.

"ఆయన్ని చూచినట్టుందని మోసగించింది. దురాగతాలు మితిమీరిపోతున్నాయి" అనుకున్నాడు. అయిన ముప్ఫై వేల నగలూ పోయినా, ఆవిడెప్పుడో వొస్తుందనే ఆయన ఆశ!

—...—